ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
శుక్రవారం 7 జూన్ 2024



టీడీపీ అధినేత చంద్రబాబును, ఆయన సతీమణి భువనేశ్వరిని కలిసి శుభాకాంక్షలు చెబుతున్న డి.చంద్రశేఖర్

గుడ్! బాగా పని చేశారు

● టీడీపీ చెన్నై విభాగానికి చంద్రబాబు ప్రశంస

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బాగా పని చేశారని టీడీపీ చెన్నై విభాగానికి ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రశంసించారు. టీడీపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో గురువారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆ పార్టీ చెన్నై విభాగ అధ్యక్షుడు డి.చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. నారా లోకేష్ పాదయాత్రలో, భువనేశ్వరి ప్రజాగళం కార్యక్రమంలోనూ కో-ఆర్డినేటర్‌గా చక్కని పాత్ర నిర్వర్తించారంటూ భుజం తట్టి ప్రశంసించారు. అనంతరం భువనేశ్వరిని కూడా కలిసిన చంద్రశేఖర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించడం సంతోషంగా వుందని తెలిపారు.



శ్రీరంగం అమ్మా మండపం సముద్రతీరంలో భక్తులు

● రామేశ్వరంలో పితృతర్పణాలు

● కడలిలో పుణ్యస్నానాలు



రామేశ్వరం అగ్నితీర్థంలో భక్తుల పుణ్యస్నానాలు

వైభవంగా వైకాశి అమావాస్య

ప్యారీస్, జూన్ 6: వైకాశి అమావాస్య సందర్భంగా రాష్ట్రంలోని సముద్రతీరాలు, నదులు, చెరువుల తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, పితృదేవతలకు గురువారం తర్పణాలు వదిలి పూజలు చేశారు. రామనాథపురం జిల్లా రామేశ్వరంలో ప్రసిద్ధిచెందిన రామనాథస్వామి ఆలయానికి పెద్దసంఖ్యలో పోటెత్తిన భక్తులు క్యూలైన్లలో వేచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అమావాస్య కావడంతో స్వామివారి దర్శనానంతరం అగ్నితీర్థ కడలిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తమ పితృదేవతలకు పూజలు చేశారు. అనంతరం రామనాథస్వామి ఆలయ ప్రాంగణానికి వెళ్లి అక్కడున్న 22 తీర్థకొలనుల్లో కూడా స్నానాలు ఆచరించారు. వైకాశి అమావాస్య సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటలకే ఆలయాన్ని తెరచిన శివాచార్యులు స్పటిక లింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మహా హారతి అనంతరం భక్తులను క్యూలైన్లలో దర్శనానికి అనుమతించారు. అదే విధంగా, తిరుచ్చి జిల్లా శ్రీరంగం అమ్మా మండపంలో ఉదయం 6 గంటల నుంచే భక్తులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు అమ్మా మండపం పుష్కరఘాట్‌లో పురోహితుల ద్వారా పితృదేవతామూర్తులకు తర్పణాలు వదిలారు. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలో ఉన్న చదురగిరి కొండల ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన సుందర మహాలింగం ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి, అమావాస్య సందర్భంగా తలా మూడు రోజులు, ప్రదోషానికి రెండు రోజులు మొత్తం 8 రోజులు భక్తులను దర్శనానికి అనుమతిస్తుంటారు. ఆ విధంగా గురువారం ఉదయం చెన్నై, తిరుచ్చి, కోవై తదితర జిల్లాల నుంచి వెళ్లిన వేలాది మంది భక్తులను తెల్లవారుజాము నుంచే మెట్ల మార్గం గుండా అటవీ శాఖ అధికారులు కొండపైకి అనుమతించారు. ముందుగా భక్తుల లగేజీ తనిఖీ చేశారు. ఆలయ పూజారులు సుందర మహాలింగ స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.



సౌమ్య అన్బుమణి

అయ్యో అరూర్ !

సౌమ్య విజయాన్ని అడ్డుకున్న ఆ నియోజకవర్గం

పెరంబూర్, జూన్ 6: ధర్మపురిలో పోటీ చేసిన పీఎంకే అభ్యర్థి సౌమ్య అన్బుమణి విజయానికి అరూర్ నియోజకవర్గం అడ్డుగా నిలిచింది. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ధర్మపురి, పాలకోడు, పెన్నాగరం, పాపిరెడ్డిపట్టి, అరూర్ (రి) మేట్టూరు తదితర ఆరు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. వన్నియర్ సామాజిక వర్గానికి చెందినవారు ఈ లోక్‌సభ నియోజకవర్గంలో అధికంగా ఉండడంతో పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి సతీమణి సౌమ్య ఈసారి ఎన్నికల బరిలో నిలిచారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి నుంచి సౌమ్య అన్బుమణి ముందంజలో నిలిచారు. పెన్నాగరం, పాపిరెడ్డిపట్టి, ధర్మపురి శాసనసభ నియోజకవర్గాల్లో డీఎంకే అభ్యర్థి కంటే భారీగా ఓట్ల ఆధిక్యంలో కొనసాగారు. అదే సమయంలో, పాలకోడు, మేట్టూరు శాసనసభ నియోజకవర్గాల్లో డీఎంకే అభ్యర్థి మణి అధిక ఓట్లు సాధించారు. కానీ అరూర్ నియోజకవర్గంలో సౌమ్య పూర్తిగా వెనుకబడిపోయారు. ఆ నియోజకవర్గంలో దళితులు అధికంగా ఉన్నారు. ఆది నుంచి దళిత వర్గాలకు-పీఎంకేకు మధ్య వైరం కొనసాగుతోంది. దీంతో ఆ నియోజకవర్గంలో వున్న దళితులు గంపగుత్తగా డీఎంకే అభ్యర్థికి ఓటేశారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2.15 లక్షల ఓట్లుండగా, వీటిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లు అధికంగా ఉన్నాయి. డీఎంకే అభ్యర్థికి 86,850 ఓట్లు రాగా, సౌమ్యకు 46,175 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ నియోజకవర్గ ఓట్లతో 40 వేల ఆధిక్యంలో కొనసాగిన డీఎంకే అభ్యర్థి మణి, ఇతర నియోజకవర్గాల్లో సౌమ్యకు లభించిన మెజార్టీని అధికమించి 21,300 ఓట్లతో విజయం సాధించారు. దీంతో అరూర్ నియోజకవర్గమే సౌమ్య పరాజయానికి కారణంగా నిలిచినట్లయింది.

5.64 శాతం ఓట్లు ఎందుకు తగ్గాయి?

● డీఎంకేలో చర్చ.. స్టాలిన్ సమీక్ష



చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తాజాగా ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి రాష్ట్రంలో ఘన విజయం సాధించింది. పుదుచ్చేరితో కలిపి మొత్తం 40 స్థానాలను కైవసం చేసుకుంది. వందకు వంద మార్కులు వచ్చినట్లేనని అన్ని వర్గాలు భావిస్తున్నాయి. కానీ గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి డీఎంకేకి 5.64 శాతం ఓట్లు తగ్గడం చర్చనీయాంశమైంది. డీఎంకే దీనిని సీరియస్‌గా పరిగణిస్తోంది. అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో 'ఫీల్ గుడ్' వున్నప్పటికీ అంత మేర ఓట్ల శాతం ఎందుకు తగ్గిందన్న దానిపై డీఎంకేలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి పార్టీలు మొత్తం 52.65 శాతం ఓట్లు సాధించాయి. ఈ కూటమిలోని డీఎంకే 32.76 శాతం, కాంగ్రెస్ 12.76, సీపీఐ 2.44, సీపీఎం 2.40, డీపీఐ 1.18, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ 1.11 శాతం ఓట్లు పొందాయి. ప్రస్తుత ఎన్నికల్లో డీఎంకే కూటమి 47.01 శాతం మాత్రమే ఓట్లు సాధించింది. కూటమి పార్టీల వారీగా డీఎంకే 26.93 శాతం, కాంగ్రెస్ 10.67, సీపీఐ 2.15, సీపీఎం 2.52, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ 0.67 శాతం ఓట్లు పొందాయి. 2019 ఎన్నికల్లో కూటమి ఉన్న పార్టీలే ప్రస్తుత ఎన్నికల్లో కూడా పోటీచేశాయి. కూటమిలో మార్పులు లేకపోయినా ఓట్ల శాతం మాత్రం తగ్గడం కూటమి పార్టీ నేతలను కలవరానికి గురిచేస్తోంది. మరీ ముఖ్యంగా కూటమిలోని అన్ని పార్టీలకంటే డీఎంకేకే ఎక్కువశాతం ఓట్లు తగ్గాయి. దీనిని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో పాలక పార్టీ అయినప్పటికీ, పథకాలన్నీ తమ ప్రభుత్వమే అమలు చేస్తున్నప్పటికీ ఓటు బ్యాంకు ఎలా తగ్గిందని ఆయన నేతలను ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఏ నియోజకవర్గంలో ఓట్లు తగ్గాయి? ఎందుకు తగ్గాయన్న దానిపై ఆయన నివేదికలు తెప్పించుకుని నేతలతో చర్చిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి 30.27 శాతం ఓట్లు సాధించగా, ప్రస్తుత ఎన్నికల్లో 22.66 శాతం ఓట్లు మాత్రమే పొందిన విషయం తెలిసిందే.

విరుదునగర్‌లో రీకౌంటింగ్ జరపాలి

● ప్రేమలత డిమాండ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రీకౌంటింగ్ జరపాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ తరఫున విరుదునగర్‌లో పోటీ చేసిన కెప్టెన్ విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకర్ ఓడిపోలేదని, కొందరి కుట్రకారణంగా ఓడించబడ్డాడని ఆరోపించారు. కౌంటింగ్ చురుకుగా సాగుతుండగా ఉన్నట్టుండి మధ్యాహ్నం 3 నుండి 5 గంటల దాకా కౌంటింగ్ నిలిపివేశారని, అదే సమయంలో ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ తనపై తీవ్ర ఒత్తిడి పెరిగిందంటూ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచారన్నారు. తమ పార్టీ ఎన్నో ఎన్నికలను ఎదుర్కొన్నదని, అయితే విరుదునగర్ కౌంటింగ్ సమయంలో జరిగినంత అక్రమాలను ఎన్నడూ చూడలేదన్నారు. విరుదునగర్‌లో రీకౌంటింగ్ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. 13వ రౌండ్ ఓట్ల లెక్కింపు సమయంలోనే అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో రిటైర్డ్ జడ్జి సమక్షంలో విరుదునగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మళ్ళీ జరపాలని ప్రేమలత డిమాండ్ చేశారు. భోజన విరామ సమయం తర్వాత రెండు గంటలపాటు కౌంటింగ్ నిలిపివేయడానికి గల కారణాలను అధికారులు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు.

మాణిక్కం ఠాగూర్ ఖండన...

విరుదునగర్ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించడాన్ని ఆ నియోజకవర్గంలో గెలిచిన ఎంపీ మాణిక్కం ఠాగూర్ ఖండించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తరువాత డీఎండీకే అభ్యర్థి, ఆయన ఏజెంట్లు ప్రశాంతంగా వెళ్ళిపోయారని, అక్రమాలు జరిగి ఉంటే అప్పుడే ఫిర్యాదు చేసి ఉండాలని తెలిపారు. కౌంటింగ్‌లో ఎక్కడా ఎలాంటి అవినీతి అక్రమాలు జరుగలేదని ఆయన వివరించారు.

11 చోట్ల బీజేపీ అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు

పెరంబూర్, జూన్ 6: రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన పరాజయం రాష్ట్ర బీజేపీ నేతలకు నిద్ర పట్టనివ్వడం లేదు. మరీ ముఖ్యంగా పోటీ చేసిన 23 నియోజకవర్గాలకు గాను 11 చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోవడం నేతలకు మింగుడు పడడం లేదు. రాష్ట్రంలో ఆ పార్టీకి కొన్నిచోట్ల గతం కంటే గణనీయంగా ఓటు బ్యాంకు పెరిగినా, 11 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోవడాన్ని మాత్రం ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పాల్ కనకరాజ్ (ఉత్తర చెన్నై), కార్తికేయన్ (చిదంబరం), సెంథిల్‌నాథన్ (కరూర్), రమేష్ (నాగపట్టణం), కేపీ రామలింగం (నామక్కల్), పారివేందర్ (పెరంబలూర్), కరుప్పు మురుగానందం (తంజావూర్), ఏపీ మురుగానందం (తిరుప్పూర్), పొన్.బాలగణపతి (తిరువళ్లూరు), అశ్వత్థామన్ (తిరువణ్ణామలై), రాధిక (విరుదునగర్) డిపాజిట్లు కోల్పోయారు. అలాగే, బీజేపీ కూటమిలో పోటీచేసిన పీఎంకే ఆరు స్థానాలు, టీఎంసీ మూడు స్థానాలు, ఏఎంఎంకే ఒక స్థానంలోనూ డిపాజిట్ కోల్పోయింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఏం జరిగిందన్నదానిపై బీజేపీ ముఖ్య నేతలు ఆరా తీస్తున్నారు.











తమిళిచ్చి తంగపాండ్యన్

కనిమొళి

డా.రాణి శ్రీకుమార్

జ్యోతిమణి, న్యాయవాది సుధ

పార్లమెంటుకు రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళలు

ప్యారీస్, జూన్ 6: రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళా ఎంపీలు లోక్‌సభకు వెళ్లనున్నారు. రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో మహిళలకు కల్పించిన 50 శాతం రిజర్వేషన్ అమలు జరుగుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా, చట్టసభలు, పార్లమెంటులో కూడా 33 శాతం రిజర్వేషన్ అమలుపరచాలని కోరుతూ మహిళా సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ముగిసిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి మొత్తం 945 మంది పోటీచేశారు. వీరిలో 77 మంది మహిళలున్నారు. కాగా, 39 నియోజకవర్గాల్లో పోటీచేసిన మహిళా అభ్యర్థుల్లో అధికార డీఎంకే నుంచి ముగ్గురు, డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ ఇద్దరు ఘనవిజయం సాధించారు. తూత్తుకుడి పార్లమెంటు స్థానంలో కనిమొళి (డీఎంకే), దక్షిణ చెన్నైలో తమిళిచ్చి తంగపాండ్యన్ (డీఎంకే), తెన్‌కాశిలో డా.రాణి శ్రీకుమార్ (డీఎంకే), కరూర్‌లో జ్యోతిమణి (కాంగ్రెస్), మైలాడుదురై నుంచి న్యాయవాది సుధ (కాంగ్రెస్) పార్లమెంటుకు వెళ్లనున్నారు. ఇదిలా ఉండగా, పీఎంకే తరఫున ధర్మపురి నియోజకవర్గంలో పోటీచేసిన సౌమ్య అన్బుమణి, దక్షిణ చెన్నైలో బీజేపీ తరఫున పోటీ చేసిన డా.తమిళిసై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెంది పార్లమెంటుకు వెళ్లే అవకాశాలు కోల్పోయారు.

అన్నాడీఎంకే కూటమిలోనూ..

ఈ లోక్‌సభ ఎన్నికల్లో 33 స్థానాల్లో అన్నాడీఎంకే, మిగిలిన స్థానాల్లో కూటమి పార్టీలు పోటీచేశాయి. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఒక్క స్థానంలోనూ గెలుపొందలేకపోయింది. అయితే 12 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. దక్షిణ చెన్నై, కన్నియాకుమారి, రామనాథపురం, తేని, తూత్తుకుడి, తిరునల్వేలి, వేలూరు నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే, తిరువళ్లూర్, మధ్య చెన్నై నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే కూటమి పార్టీ డీఎండీకే డిపాజిట్లు కోల్పోయింది. అలాగే, పుదుచ్చేరిలోనూ అన్నాడీఎంకేకు డిపాజిట్ దక్కలేదు. ముఖ్యంగా, దక్షిణ చెన్నైలో పోటీచేసిన ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి డి.జయకుమార్ కుమారుడు జయవర్ధన్ డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.

అన్నాడీఎంకేలో మళ్ళీ విలీన రాగం !

ససేమిరా కుదరదన్న కేపీ మునుసామి

సయోధ్య కమిటీ అవసరమన్న కేపీ కృష్ణన్

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయం ఎదురైన వేళ అన్నాడీఎంకేలో మళ్ళీ విలీనం పాట జోరందుకుంది. పార్టీ నుంచి బహిష్కృతుడైన మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం, మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ పార్టీకి పూర్వవైభవం కలగాలంటే విలీనం తప్పనిసరంటూ ప్రకటనలు చేసి అన్నాడీఎంకేలో మళ్ళీ కలకలం రేపారు. లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నేతృత్వంలోని అన్నాడీఎంకే చిత్తుగా ఓడిపోయిన నేపథ్యంలో విడిపోయిన వర్గాలన్నీ ఒకటి కావాలంటూ అసమ్మతివర్గమంతా అదేపనిగా పిలుపునిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఉన్నంతవరకూ అన్నాడీఎంకేకు 44 శాతం ఓటు బ్యాంక్ స్థిరంగా ఉండేది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో ఓటు బ్యాంక్ 20 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యం లో 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించాలంటే అందరూ కలిసి ఉండాలని ఓపీఎస్ వర్గం నుంచి వైదొలగిన నేత, మాజీమంత్రి కేపీ కృష్ణన్ ప్రకటించారు. అన్నాడీఎంకేకు పూర్వవైభవం కల్పించాలంటే విడిపోయిన నాయకులంతా మళ్ళీ కలిసికట్టుగా ఎన్నికల బరిలోకి దిగాలని శశికళ ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఈపీఎస్ నాయకత్వంలో ఇప్పటివరకూ జరిగిన నాలుగు ఎన్నికల్లో పార్టీ తీవ్ర పరాజయం పొందిందని, ఇకనైనా పార్టీ నేతలు వాస్తవాలను గ్రహించి అన్నివర్గాలను కలుపుకునిపోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఎంజీఆర్, జయ హయాంలో పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా ఎన్నికల్లో ఆశినంత విజయం సాధించేదని, ప్రస్తుతం ఈపీఎస్ నాయకత్వంలో పార్టీ పరిస్థితి అధోగతికి చేరుకున్నదని, ఈ పరిస్థితులను చూస్తూ తాను ఊరుకునే ప్రసక్తేలేదని ఆమె హెచ్చరించారు. పార్టీలో కొందరికే ప్రాధాన్యత ఇవ్వడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చిత్తుగా ఓడిపోయిందన్నారు. పార్టీ నుంచి వైదొలగినవారంతా ఒక్కటయ్యే సమయం ఆసన్నమైందని, ఆ దిశగానే తాను ప్రయత్నాలు కొనసాగిస్తానని శశికళ తెలిపారు.



ఓపీఎస్, కేపీ మునుసామి, ఈపీఎస్, శశికళ

ఐకమత్యమే బలం...

పార్టీలో అంతా ఐకమత్యంగా ఉంటే లోక్‌సభ ఎన్నికల్లో ఇంతటి ఘోరపరాజయం ఉండేది కాదని రామనాథపురంలో బీజేపీ కూటమి తరఫున ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఓపీఎస్ పేర్కొన్నారు. కట్టెలు వేర్వేరుగా ఉంటే సులభంగా విరిచేయవచ్చని అదే కట్టెలన్నీ కట్టగా ఉంటే వాటిని విరగ్గొట్టడం ఎవరికీ సాధ్యం కాదని ఆయన తెలిపారు. ఇకనైనా పట్టుదలకు పోకుండా పార్టీ శ్రేణులను తప్పుదోవపట్టించకుండా పార్టీని బలపరిచేందుకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పార్టీ శ్రేణులే బాధ్యులని వారిపై అపవాదు వేయడం తగదన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్ నటించిన ఓ సినిమా పాటను ఆయన ఉదహరిస్తూ అందరూ కలిసి ఒకే లక్ష్యంగా పోరాడితే భవిష్యత్ మనదేనంటూ పేర్కొన్నారు.

అయోమయం సృష్టించడానికే...

సాఫీగా సాగుతున్న పార్టీలో అయోమయం సృష్టించడానికే శశికళ విలీనం పాట ఎత్తుకున్నారని అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కేపీ మునుసామి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే తాజా లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటు బ్యాంక్ పెరిగిందే తప్ప తగ్గలేదని ఆయన స్పష్టం చేశారు. 2019లో 18 శాతం ఓటు బ్యాంక్ రాగా, ఈసారి ఓటు బ్యాంక్ 20.46శాతానికి పెరిగిందని, పార్టీ పురోగతికి అడుగడుగునా ఆటంకాలు కలిగించిన ఓపీఎస్ ప్రస్తుతం అందరూ విలీనం కావాలంటూ పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం పార్టీలో ఎక్కడా అసమ్మతి లేనేలేదని, అందరూ ఐకమత్యంగానే ఈపీఎస్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని చెప్పారు. పార్టీ సర్వసభ్యమండలిని అవమానించడమే కాకుండా పార్టీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించిన ఓపీఎస్‌ను ఎట్టి పరిస్థితులలోనూ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

సయోధ్య కమిటీ...

ఓపీఎస్ వర్గం నుంచి వైదొలగిన మాజీ మంత్రి కేపీ కృష్ణన్ పార్టీ నుండి వెళ్లినవారిని మళ్ళీ చేర్చేందుకు సయోధ్య కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవటానికి పార్టీలో చీలికలే కారణమన్నారు. 1975లో పార్టీలో ఇదేవిధంగా చీలికలు ఏర్పడినప్పుడు ఎంజీఆర్ సయోధ్య కమిటీని ఏర్పాటు చేసి అందరిని ఒకతాటిపైకి తెచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆ రీతిలోనే పార్టీ నుంచి వైదొలగినవారిని మళ్ళీ పార్టీలో చేర్చడానికి సయోధ్యకమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సమాచార దర్శిని

అప్రెంటీస్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 6: భారత రైల్వే శాఖ ఆధ్వ ర్యంలోని చెన్నై ఐసిఎఫ్‌లో అప్రెంటీస్ పోస్టులకు ఈ నెల 21వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, వెల్డర్ వంటి వివిధ విభాగాల్లో టెన్త్, ప్లస్ టూ, ఐటీఐ చదివిన వారు రూ.100 రుసుము చెల్లించి www.pb.icf.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, మహిళలకు ఫీజు మినహాయింపు కల్పించారు.

'సెట్' పరీక్ష వాయిదా

ఐసిఎఫ్, జూన్ 6: ఈ నెల 7,8 తేదీల్లో జరగనున్న 'సెట్' పరీక్ష వాయిదావేశారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో చేరేందుకు ప్రభుత్వం నెట్, సెట్ అర్హత పరీక్ష నిర్వహిస్తోంది. ఈ నెల 7,8 తేదీల్లో జరగాల్సిన సెట్ పరీక్ష సాంకేతిక కారణాలతో వాయిదావేసినట్లు నెల్లై మనోన్మణీయం సుందరనార్ విశ్వవిద్యాలయం తెలిపింది. మళ్లీ పరీక్ష నిర్వహించే తేది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లకు ఆధ్యాత్మిక పర్యాటక రైలు

ఐసిఎఫ్, జూన్ 6: మదురై నుంచి కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లకు ప్రత్యేక ఆధ్యాత్మిక పర్యాటక రైలు ఈ నెల 20వ తేది నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. మదురై నుంచి 20వ తేది రాత్రి 8 గంటలకు బయల్దేరే ఈ రైలు 23వ తేది ఉత్తరాఖండ్‌లో ఉన్న రిషికేష్ చేరుకుంటుంది. 24వ తేది ఉదయం మరో మార్గంలో రుద్రప్రయాగ్ చేరుకుంటుంది. 25 నుంచి 29వ తేది వరకు గుప్తకాశి, కార్తీక్‌స్వామి ఆలయం, జోషి మఠం, బద్రీనాథ్ క్షేత్రాలకు రోడ్డు మార్గంగా భక్తులను తీసుకెళ్లనున్నారు. గుప్తకాశి నుంచి కేదార్‌నాథ్‌కు హెలికాప్టర్‌లో తరలించనున్నారు. ఈ పర్యటన ముగించుకొని ఈ నెల 31వ తేది రిషికేష్ నుంచి బయల్దేరి జూలై 2వ తేది మదురై చేరుకుంటుంది. రెండు మార్గాల్లో ఈ రైలు దిండుగల్, తిరుచ్చి, విల్లుపురం, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లలో ఆగనుంది. ఒకరికి స్లీపర్ కోచ్‌లో రూ.58,946, ఏసీ కోచ్‌లో రూ.62,535 ఛార్జీగా నిర్ణయించారు. ఇతర వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ఆరు శాతం మేర పెరగనున్న విద్యుత్ ఛార్జీలు

ఐసిఎఫ్, జూన్ 6: రాష్ట్రంలో జూలై నుంచి విద్యుత్ బిల్లులు ఆరు శాతం వరకు పెరగనుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ బోర్డు రూ.1.60 లక్షల కోట్ల రుణాలతో ఆర్థిక సంక్షోభంలో ఉంది. దీంతో 2022 సెప్టెంబరు 10న విద్యుత్ ఛార్జీలు 30 శాతానికి పైగా పెరిగాయి. దీనికి సంబంధించిన జీవోలో 2022-23 నుంచి 2026-27 వరకు ఐదేళ్లకు విద్యుత్ బిల్లులు పెంచేందుకు అనుమతిచ్చారు. 2022-23లో విద్యుత్ ఛార్జీలు పెరిగిన నేపథ్యంలో, రాబోయే నాలుగేళ్లకు ప్రతి ఏటా జూలై 1న ఛార్జీలు పెంచనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, ఆరు శాతం వరకు విద్యుత్ ఛార్జీలు పెరగనున్నాయని అధికారులు తెలిపారు.

ఎన్నూర్‌లో సోలార్ విద్యుత్ కేంద్రం

ఐసిఎఫ్, జూన్ 6: స్థానిక ఎన్నూర్‌లో వంద మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. ఎన్నూర్‌లో విద్యుత్ బోర్డుకు 450 మెగావాట్ల సామర్థ్యంతో 1970-75 సంవత్సరంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరిగిన ఈ కేంద్రాన్ని 2017లో శాశ్వతంగా మూసివేశారు. ఇక్కడ యంత్రాలు, ఇతర ఉపకరణాలు తొలగించనున్నారు. మొత్తం 400 ఎకరాలకు పైగా ఉన్న ఈ స్థలంలో 2 వేల మెగావాట్ల సామర్థ్యంతో గ్యాస్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఒక యూనిట్ విద్యుదుత్పత్తి కి రూ.10 వరకు ఖర్చు అవుతుండడంతో దానిని విరమించుకొని త్వరలో 100 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేయనున్నామని, ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం 53.5 లక్షల మంది ఎదురుచూపు

ఐసిఎఫ్, జూన్ 6: రాష్ట్రంలో పాఠశాల, కళాశాల విద్య ముగించిన వారుతో సహా పలువురు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో పేర్లు నమోదుచేసుకుంటున్నారు. ఆ ప్రకారం మే 31వ తేది వరకు 53,48,663 మంది ప్రభుత్వ ఉద్యోగం కోసం పేర్లు నమోదుచేసుకున్నారు. వారిలో పురుషులు 24,63,021 మంది, మహిళలు 28,85,301 మంది, హిజ్రాలు 281 మంది ఉన్నారు. 18 ఏళ్లలోపున్న పాఠశాల, కళాశాల విద్యార్థుల సంఖ్య 10,72,353, 19 నుంచి 30 ఏళ్లలోపున్న వారు 23,27,649 మంది, 31 నుంచి 45 ఏళ్లలోపున్న వారు 16,93,040 మంది, 46 నుంచి 60 ఏళ్లలోపున్న వారు 2,47,811 మంది, 60 ఏళ్లకు పైబడిన వారు 7,810 మంది ఉన్నారు. అలాగే, దివ్యాంగులు 1.50 లక్షల మంది ఉన్నట్లు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారులు తెలిపారు.

334 మంది ఎంటీసీ డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

అడయార్, జూన్ 6: విధి నిర్వహణలో పదికిపైగా ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లు 334 మందికి పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నగర రవాణా సంస్థ (ఎంటీసీ) ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో ఎంటీసీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు ప్రతి రోజూ 33 మంది డ్రైవర్ల చొప్పున ఈ వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. దీని కోసం ఐదుగురు వైద్యులతో కూడిన ప్రత్యేక వైద్య బృందం నేత్ర, చెవి, బీపీ, డయాబెటీస్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ ఇలా అన్ని రకాల వైద్య పరీక్షలను చేయనున్నారు.



వేలూరు ఎంపీగా విజయం సాధించిన కదిర్ ఆనంద్‌ను కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం అవై అధ్యక్షుడు జనార్ధనన్, ఉపాధ్యక్షులు విజయకుమారి, ఇండియన్ వైద్య సంఘం సీఎంసీ శాఖ సెక్రటరీ డా.ఇక్రమ్, శ్రీనివాసన్, కోశాధికారి పళని, మేనేజింగ్ కమిటీ సభ్యులు డా.దీనబంధు, ఎస్.రమేష్‌కుమార్ జైన్, సెక్రటరీ శివవడివు తదితరులు

జైలులో గడిపిన సవుక్కు శంకర్‌కు గంటకు రూ.10 వేలు ఇచ్చేందుకు సిద్ధమా...?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



ప్యారీస్, జూన్ 6: మహిళా పోలీసులు, పోలీసు అధికారులను కించపరిచేలా వ్యాఖ్యానించి గూండా చట్టం కింద జైలుపాలైన యూ ట్యూబర్ సవుక్కు శంకర్ జైలులో గడిపిన ప్రతి గంటకు రూ.10 వేలు ఇచ్చేందుకు సిద్ధమా అని రాష్ట్రప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. తన కుమారుడిపై నమోదుచేసిన గూండా చట్టాన్ని వ్యతిరేకిస్తూ సవుక్కు శంకర్ తల్లి కమల హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. న్యాయమూర్తులు స్వామినాధన్, బాలాజీలతో కూడి ధర్మాసనం విచారణ జరిపి విభిన్న తీర్పులిచ్చాయి. న్యాయమూర్తి స్వామినాధన్, సవుక్కు శంకర్‌పై నమోదుచేసిన గూండా చట్టాన్ని రద్దు చేశారు. మరో న్యాయమూర్తి బాలాజీ ఈ కేసులో ప్రభుత్వం తరఫున సమాధానం చెప్పాలని ఆదేశించారు. దీంతో హైకోర్టు ఈ కేసు విచారణకు మూడో న్యాయమూర్తిగా జి.జయచంద్రన్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో, గురువారం న్యాయమూర్తి జయచంద్రన్ సమక్షంలో సవుక్కు శంకర్ తల్లి దాఖలుచేసిన పిటిషన్ విచారణకు రాగా, రాష్ట్రప్రభుత్వం తరఫున హాజరైన జె.రవీంద్రన్, ఈ కేసును ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్‌కు బదిలీచేయాలని కోరారు. అప్పుడు జోక్యం చేసుకున్న న్యాయమూర్తి... గూండా చట్టం కింద సవుక్కు శంకర్‌ను జైలుకు తరలిస్తూ చట్టప్రకారం ఉత్తర్వులు జారీచేయలేదని, దీనిపై గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ గూండా చట్టం రద్దయితే జైలులో గడిపిన సవుక్కు శంకర్‌కు గంటకు రూ.10 వేలు చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు.

అన్నామలై నోటి దురుసు వల్లే బంధం తెగింది

● మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి



మీడియాతో వేలుమణి

ప్యారీస్, జూన్ 6: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నోటి దురుసు వల్లే రెండు పార్టీల మధ్య బంధం తెగిపోయిందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి పేర్కొన్నారు. కోవైలో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ వేలుమణి మాట్లాడుతూ... రెండు కోట్ల మందికి పైగా సభ్యులున్న అన్నాడీఎంకే పార్లమెంటుకు, అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో విజయావకాశాలు కోల్పోయి మళ్లీ బలం పుంజుకుందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓడినా ఓటు బ్యాంక్ ఏ మాత్రం చెక్కు చెదరలేదని, ఓటమిపై పార్టీ అధిష్ఠానం సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. అన్నాడీఎంకే గురించి అన్నామలై చేసిన విమర్శల వల్లే ఈ ఎన్నికల్లో కూటమి ఏర్పడలేదని, ఒకవేళ రెండు పార్టీలు ఒకే కూటమిలో ఉన్నట్లయితే 30 పార్లమెంటు నియోజకవర్గాల్లో విజయావకాశాలుండేవన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో మళ్లీ ప్రజలు మెచ్చే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వేలుమణి ధీమా వ్యక్తం చేశారు.

పాండి జ్యూస్ పేరిట సారా ప్యాకెట్ల విక్రయం

ఐసిఎఫ్, జూన్ 6: పాండి జ్యూస్ పేరుతో సారా ప్యాకెట్లు విక్రయించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా కుంభకోణం, తిరువిడైమరుందూర్, పందలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో జ్యూస్ పేరుతో సారా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. బుధవారం నల్లతాడ గ్రామంలో కూల్‌డ్రింక్ షాపులో తనిఖీచేయగా,పాండిజ్యూస్ పేరుతో ఉన్న సారా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని విక్రయించిన అదే ప్రాంతానికి చెందిన సెల్వరాజ్, ఆయన కుమారుడు సెల్వమణిలను పోలీసులు అరెస్ట్ చేశారు.

బ్రహ్మజ్ఞానం సంఘం ఆధ్వర్యంలో నేత్ర శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేలూరు, జూన్ 6: బ్రహ్మజ్ఞానం సంఘం తామరైకుడిలో ప్రభుత్వ పెండెలెంట్ ఆస్పత్రి సమీపంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డా.అగర్వాల్ కంటి ఆస్పత్రి, గుడియాత్తం సహకారం తో ఏర్పాటుచేసిన ఈ శిబిరానికి వేలూరు పథక సెక్రటరీ, తమిళనాడు దేశీయ విద్యుత్ కార్మికుల సమ్మేళనం లయన్.కామరాజ్ అధ్యక్షత వహించగా, వేలూరు రాజ్ ప్రమోటర్స్ కన్‌స్ట్రక్షన్ నేత సెల్వరాజ్, సేకియార్‌వియా కమిటీ అధ్యక్షుడు గజేంద్రన్ తదితరులు ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు.

803 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు

పెరంబూర్, జూన్ 6: పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో 803 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు 4,76,468 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. ఆ ప్రకారం, వేలూరు నియోజకవర్గంలో పోటీచేసిన నటుడు మన్సూర్ అలీఖాన్ సహా 27 మంది అభ్యర్థులు నోటా కంటే తక్కువ ఓట్లు పొందారు. తిరువణ్ణామలైలో 27 మంది, అరక్కోణంలో 22, ఆరణిలో 25, ఈరోడ్‌లో 27, కోవైలో 33, కళ్లకుర్చిలో 16, పుదుచ్చేరిలో 21, తిరునల్వేలిలో 18 మంది, తూత్తుకుడిలో 24 మంది, తెన్‌కాశిలో 12 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.. అలాగే, కన్నియాకుమారిలో 17 మంది, తిరుప్పూర్‌లో 9, పొల్లాచ్చిలో 11, నీలగిరిలో 12, విరుదునగర్‌లో 23, మదురైలో 11, దిండుగల్‌లో 11, రామనాథపురంలో 19, శివగంగలో 18, తేనిలో 21, నామక్కల్‌లో 36, ధర్మపురిలో 20, కడలూరులో 14, విల్లుపురంలో 13, చిదంబరంలో 10, కృష్ణగిరిలో 23, కరూర్‌లో 50, పెరంబలూరులో 19, తిరుచ్చిలో 30, తంజావూరులో 7 నాగపట్టణంలో 5, మైలాడుదురైలో 12 మంది తక్కువ ఓట్లు పొందారు. ఇక, మధ్య చెన్నైలో 27 మంది, దక్షిణ చెన్నైలో 37, ఉత్తర చెన్నైలో 31, శ్రీ పెరుంబుదూర్‌లో 27, తిరువళ్లూర్‌లో 10, కాంచీపురంలో 7 మంది అని మొత్తం 803 మంది అభ్యర్థులు నోటా కంటే తక్కువ ఓట్లు పొందారు. కాగా, వీరిలో స్వతంత్ర అభ్యర్థులు సహా ప్రముఖ పార్టీల అభ్యర్థులు కూడా ఉండడం కొసమెరుపు.

డిపాజిట్ దక్కించుకున్న ఒకే ఒక్కడు



పన్నీర్‌సెల్వం

పెరంబూర్, జూన్ 6: రాష్ట్రంలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్‌తో పాటు రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థిగా ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) నిలిచారు. రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో స్వతంత్ర అభ్యర్థిగా పనస పండు గుర్తుపై పోటీ చేశారు. రాష్ట్రంలోని 39 నియోకవర్గాల్లో కూటమి పార్టీల అభ్యర్థులు, సుమారు 800 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేశారు. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. కానీ, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి డిపాజిట్లు పొందిన వ్యక్తిగా ఓపీఎస్ నిలిచారు. ఆయన 8,42,882 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే కూటమిలో పోటీచేసిన ఐయూఎంఎల్ అభ్యర్థి నవాజ్ ఘనీ 5,09,664 ఓట్లతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

నెంబరు ప్లేట్లపై స్టిక్కర్లున్న వాహనాలు స్వాధీనం

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 6: నెంబరు ప్లేట్లపై స్టిక్కర్లు అంటించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలు స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. నగరంలో సొంత వాహనాలకు స్టిక్కర్లు అంటించడంపై విధించిన నిషేధం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దానిని విచారించిన హైకోర్టు ధర్మాసనం... నెంబరు ప్లేట్లపై స్టిక్కర్లు అంటించే నిబంధనలు అతిక్రమించిన వాహనాలను స్వాధీనం చేసుకోవాలని, స్టిక్కర్లు, అద్దాలకు నల్లరంగు స్టిక్కర్లు అంటించే వాహనాలను తనిఖీ చేయాలని, ఈ కేసులో ఈ నెల 20వ తేదిలోపు వివరణాత్మక ఉత్తర్వులు జారీచేయాలని పేర్కొంది. ఆ రోజున సంబంధిత అధికారులు న్యాయస్థానానికి హాజరుకావాలంటూ, కేసు విచారణ ఆ తేదీకి వాయిదావేసింది.

ఆగని గజరాజుల సంచారం



పంట నష్టాన్ని చూపుతున్న రైతు

సదుం, జూన్ 6: సదుం మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో ఆగని గజరాజుల సంచారంతో జరుగుతున్న పంట నష్టంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి చెరుకువారిపల్లె పంచాయతీ పోతంవారిపల్లె గ్రామ సమీపంలోని రైతు వేముల ప్రకాశ్‌కు చెందిన టమోటా పంట పొలాలపై ఏనుగులు దాడిచేసి తొక్కి పంటను నాశనం చేశాయి. సమాచారం అందుకున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ మహేశ్, నలుగురు ట్రాకర్స్ సాయంతో వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించారు. ఏనుగుల అడుగు జాడలు గుర్తిస్తూ బంగారు చింత అడవి వైపుగా వాటిని దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అటవీ శివారు ప్రాంతాల్లో పంట పొలాలపై తరచూ ఏనుగుల దాడులు తీరని సమస్యగా మారిందని రైతులు వాపోతున్నారు.

ప్రాంతీయ పార్టీ హోదా పొందలేని పీఎంకే



అన్బుమణి

పెరంబూర్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో 4.32 శాతం ఓట్లు సాధించిన పీఎంకే ప్రాంతీయ పార్టీ హోదా పొందలేని పరిస్థితి నెలకొంది. బీజేపీ కూటమిలో అరక్కోణం, ఆరణి, కడలూరు, ధర్మపురి, దిండుగల్, కళ్లకుర్చి, కాంచీపురం, మైలాడుదురై, సేలం, విల్లుపురం తదితర 10 స్థానాల్లో పీఎంకే పోటీచేసింది. గెలుపు తథ్యమని భావించిన ధర్మపురి సహా అన్ని స్థానాల్లో ఆ పార్టీ పరాజయం చవిచూసింది. అత్యధికంగా ధర్మపురి నియోజకవర్గంలో 4,11,367 ఓట్లు సాధించి, అన్నాడీఎంకేను వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలిచింది. అలాగే అరక్కోణం, ఆరణి, కడలూరు స్థానాల్లో 2 లక్షల కంటే అధికంగాను, ఐదు నియోజకవర్గాల్లో లక్ష ఓట్లకు పైగా సాధించి మూడో స్థానంలో నిలిచింది. అతి తక్కువగా కళ్లకుచ్చిలో 71,290 ఓట్లు మాత్రమే సాధించింది. ఈ స్థానంలో నామ్ తమిళ్ పార్టీ తరువాత నాలుగో స్థానానికి పీఎంకే దిగజారింది. 10 నియోజకవర్గాల్లో మొత్తం 18,79,686 ఓట్లు, అంటే 4.32 శాతం ఓట్లు సాధించింది. 2009, 2014, 2019 లోక్‌సభ, 2011,2016,2021 శాసనసభ ఎన్నికల్లో వరుస పరాజయాలతో ఎన్నికల సంఘం ద్వారా పీఎంకే ప్రాంతీయ పార్టీ హోదాను కోల్పోయింది. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఓట్ల శాతం తక్కువ కావడంతో ప్రాంతీయ హోదా తిరిగి పొందలేని పరిస్థితి నెలకొంది.

హస్తినకు పుదువై మంత్రి నమశ్శివాయం

పుదుచ్చేరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం పిలుపుతో పుదుచ్చేరి రాష్ట్ర మంత్రి నమశ్శివాయం గురువారం అత్యవసరంగా ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి డీఎంకే - కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ ఎంపీ వైద్యలింగం భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ రాష్ట్రంలో అధికార భాగస్వామ్యపక్షమైన బీజేపీ అభ్యర్థిగా నమశ్శివాయం బరిలోకి దిగారు. కానీ, కాంగ్రెస్ అభ్యర్థి 1.30 లక్షల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. ఈ ఓటమికి గల కారణాలను తెలుసుకునేందుకు బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు ఆయన హస్తినకు బయలుదేరి వెళ్లారు. మరోవైపు, ఈ ఓటమి పుదుచ్చేరి ప్రభుత్వ మంత్రివర్గంలో మార్పులు చేర్పులకు అవకాశాన్ని కల్పించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కార్పొరేషన్ సిబ్బందికి శిక్షణ

వేలూరు, జూన్ 6: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వేలూరు కార్పొరేషన్ కమిషనర్ జానకి సూచనలతో కార్పొరేషన్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. వర్షాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, డెంగ్యూ సహా పలురకాల అంటువ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను 2వ మండల శానిటేషన్ అధికారి శివకుమార్ వివరించారు. కార్పొరేషన్ పరిధిలోని ఇళ్లు, హాస్టల్స్, లాడ్జీలు, హోటళ్లలో ట్యాంకులు, పరిసరాలు పరిశీలించడంతో పాటు ప్రజలకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించాలని శివకుమార్ తెలియజేశారు.

కార్పొరేషన్‌లో విలీనానికి వ్యతిరేకం

● పుదుకోటలో 8 ప్రాంతాల్లో రాస్తారోకో

పెరంబూర్, జూన్ 6: పుదుకోట కార్పొరేషన్ విస్తరణలో భాగంగా తమ ప్రాంతాలను విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఆయా ప్రాంతాల ప్రజలు రాస్తారోకో చేపట్టారు. పుదుకోట మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా చేయాలని, దానిలో వాసవాసల్, ముల్లూరు, తిరుకట్టలై, తిరుమలైరాయ సముద్రం, కవినాడు తూర్పు, కవినాడు దక్షిణం, 9ఏ నత్తంమనై తదితర 8 పంచాయతీలు పూర్తిగా, దేక్కటూరు, తిరువేంగైవాసల్, వెల్లనూరు పంచాయతీలో కొన్ని గ్రామాలను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, కార్పొరేషన్‌లో తమ ప్రాంతాలు విలీనం చేస్తే ఉపాధి పథకం రద్దవడంతో పాటు వివాహ ఆర్థికసాయం, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన సహా పలు కేంద్ర ప్రథకాలకు నిలిపివేస్తారని, అదే సమయంలో ఆస్తి, వృత్తి పన్నులు భారీగా పెరుగుతాయంటూ 11 పంచాయతీల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కార్పొరేషన్ విస్తరణ నుంచి తమ గ్రామాలను తప్పించాలని కోరుతూ 8 పంచాయతీల ప్రజలు గురువారం ఉదయం పుదుకోట నగరంలోని 8 ప్రాంతాల్లో రాస్తారోకో చేపట్టారు. పోలీసులతో అక్కడకు చేరుకున్న అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మేకకు అన్నామలై ఫొటో కట్టి ఊరేగింపు

● వీడియో వైరల్‌పై బీజేపీ నేతల ఆగ్రహం

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరులో పోటీ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఓడిపోవటంతో ఆయనను అవహేళన చేసేలా కొందరు మేక మెడలో ఆయన ఫొటో వేసి ఊరేగిస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో వైరల్ అవుతుండటంతో బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సహా ఆ పార్టీ నేతలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై అన్నామలై స్పందిస్తూ డీఎంకే శ్రేణులకు తనపై ఎలాంటి ఆగ్రహం ఉన్నా తన వద్దకే వచ్చి వ్యక్తం చేయవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయనన్ తిరుపతి ఈ వీడియోను తన ఎక్స్‌పేజీలో పెట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా రాష్ట్ర బీజేపీ కూడా తన స్పందన తెలియజేస్తూ మేకపోతును రహదారి మధ్యలో చంపి, అన్నామలైకి వ్యతిరేకంగా నినాదాలు చేసి వేడుకలు జరుపుకోవడం చూసి రాజకీయ పార్టీలన్నీ జడుసుకుంటున్నాయని పేర్కొంది. ఆ ఊరేగింపులో బాలురు పాల్గొనటం శోచనీయమని తెలిపింది.

అన్నామలై నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధిక్యం

పెరంబూర్, జూన్ 6: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికంగా ఓట్లు పొందడంతో ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. కరూర్ జిల్లా అరవకుర్చి నియోజకవర్గం తొట్టంబటల్టికి చెందిన కె.అన్నామలై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కరూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా కరూర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు వీవీ సెంథిల్‌నాథన్ పోటీచేశారు. ఈ క్రమంలో, ఎన్నికల ఫలితాల్లో అరవకుర్చి నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థి ఎల్.తంగవేల్‌కు 44,342 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణికి 87,390 ఓట్లు వచ్చాయి. కానీ, బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన సెంథిల్‌నాథన్‌కు కేవలం 19,978 ఓట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర అధ్యక్షుడు సొంత నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి కన్నా కాంగ్రెస్‌కు నాలుగు రెట్లు ఓట్లు రావడాన్ని బీజేపీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

లారీని ఢీకొన్న బైకు: ఒకరి మృతి

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని ఫ్లైఓవర్ వద్ద గురువారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎంజీఆర్ నగర్ చూళైపల్లం ప్రాంతానికి చెందిన సంతోష్ (26), అతడి స్నేహితుడు వెట్రిసెల్వన్‌తో కలిసి బైకుపై వెళుతుండగా వడపళని ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి రోడ్డుపక్కన నిలిచి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సంతోష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన వెట్రిసెల్వన్‌ను చికిత్స నిమిత్తం రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాండీబజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

చైనా వీసా అవినీతి కేసు... కార్తీ చిదంబరానికి బెయిలు మంజూరు

పెరంబూర్, జూన్ 6: శివగంగ నియోజకవర్గంలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరంకు ఢిల్లీ సీబీఐ ప్రత్యేక కోర్టు బెయిలు మంజూరు చేసింది. 2011లో ఆయన తండ్రి చిదంబరం కేంద్ర మంత్రిగా వ్యవహరించిన సమయంలో, చట్టవిరుద్ధంగా భారత్‌కు వచ్చేందుకు చైనాకు చెందిన 263 మంది వీసా అందజేసేందుకు కార్తీ సహాయం చేశాడనే ఫిర్యాదుతో ఈడీ కేసు నమోదుచేసింది. ఈ కేసు విచారణకు హాజరుకావాలని పలుమార్లు కార్తీ చిదంబరానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, బెయిలు కోరుతూ సీబీఐ ప్రత్యేక కోర్టులో కార్తీ పిటిషన్ వేశారు. దానిని విచారించిన న్యాయమూర్తి కావేరి బవేజా, కార్తీకి బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బ్రెయిన్ డెడ్.. ఐదుగురికి కొత్త జీవితం

అడయార్, జూన్ 6: విరుదనగర్ జిల్లా కార్యంపట్టి తాలూకా మాందోపు గ్రామానికి చెందిన సురేష్ కుమార్ (31) అనే వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. ఆయన కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో అవయవదానం చేయడంతో మరో ఐదుగురికి వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఈ నెల 2వ తేదీ ద్విచక్రవాహనంపై వెళ్తున్న సురేష్ కుమార్ ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు బలమైన గాయం ఏర్పడింది. దీంతో ఆయనకు మెరుగైన వైద్యం కోసం కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. కానీ, ఆయన వైద్యానికి స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. కాలేయాన్ని సేలంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి అమర్చారు. ఒక కిడ్నీని, రెండు నేత్రాలను కోవై ప్రభుత్వ ఆస్పత్రికి, మరో కిడ్నీని సేలంలోని మోహన కుమారమంగళం ప్రభుత్వ ఆస్పత్రికి అందజేశారు. ఈ అవయవదానం కారణంగా ఐదుగురు రోగులకు కొత్త జీవితం ప్రసాదించినట్టయింది.

యజమానులకు సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు, జూన్ 6: జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటి సొంతదారులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ మణివన్నన్ ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో సెల్‌ఫోన్ చోరీ చేసిన సమయంలో బాధితులు 9486214166 అనే వాట్సాప్ నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆ ప్రకారం, వచ్చిన ఫిర్యాదులను జిల్లా క్రైం విభాగం పోలీసులు విచారించి సుమారు రూ.26.20 లక్షల విలువైన 130 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సెల్‌ఫోన్లను గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మణివన్నన్, వాటిని యజమానులకు అందజేశారు. ఇప్పటివరకు చోరీకి గురైన సుమారు రూ.1.24 కోట్ల విలువైన సెల్‌ఫోన్లను నాలుగు విడతలుగా వాటి యజమానులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఊటీ బొటానికల్ గార్డెన్‌లో చిరుత

అడయార్, జూన్ 6: నీలగిరి జిల్లా ఊటీలో ఉన్న బొటానికల్ గార్డెన్‌లో చిరుత పులి కనిపించింది. ఈ విషయాన్ని బొటానికల్ గార్డెన్ సిబ్బంది గుర్తించారు. దీంతో పర్యాటకులు భయంతో వణికిపోతున్నారు. ఈ చిరుత పులి ప్రధాన ద్వారం వద్దకు వచ్చి వెళ్ళినట్టు గుర్తించారు. ప్రస్తుతం బొటానికల్ గార్డెన్‌కు భారీగా పర్యాటకులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందన్న విషయంతో పర్యాటకులతో పాటు సిబ్బంది కూడా భయపడుతున్నారు.

అపోలో ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి కారుకు ప్రమాదం

అడయార్, జూన్ 6: అపోలో గ్రూపు హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం జరిగింది. సరకుల లోడుతో వెళుతున్న వ్యాను ప్రతాప్ రెడ్డి కారును ఢీకొట్టింది. అయితే, ఈ ప్రమాదానికి కారణమైన వ్యాను డ్రైవర్, క్లీనర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బుధవారం రాత్రి థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రి నుంచి కారులో ఇంటికి వెళుతుండగా అన్నాసాలైలో వెళుతుండగా అమిత వేగంతో వచ్చిన వ్యాను కారును ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ఘటనపై ప్రతాప్ సి రెడ్డి భద్రతా విభాగం మేనేజర్ సంతోష్ నాయర్ థౌజండ్‌లైట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి వ్యాను డ్రైవర్, క్లీనర్ కోసం గాలిస్తున్నారు.

ఫైనాన్స్ కంపెనీ మోసం... రోడ్డుపై బైఠాయించిన డిపాజిటర్లు

అడయార్, జూన్ 6: నగరంలోని ది మైలాపూర్ హిందూ శాశ్వత ఫైనాన్స్ కంపెనీ మదుపరులకు డబ్బులు చెల్లించలేదని ఆరోపిస్తూ డిపాజిట్‌దారులు గురువారం రోడ్డుపై బైఠాయించారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మైలాపూర్‌లో ఉన్న ఈ కంపెనీ అధిక వడ్డీ ఇస్తామని ప్రచారం చేయడంతో 5 వేల మందికిపైగా మదుపరులు లక్ష రూపాయల నుంచి రూ.5 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. అయితే, గత ఆరు నెలలుగా వడ్డీ చెల్లించడం లేదు. మెచ్యూరిటీ అయిన డిపాజిట్ మొత్తాలను కూడా తిరిగి చెల్లించడం లేదు. దీంతో ఆగ్రహించిన డిపాజిట్‌దారులు... ఆ కంపెనీ ఉన్న రోడ్డుపై ఆకస్మికంగా బైఠాయించారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఎన్నో దశాబ్దాల కాలంగా సేవలు అందిస్తున్న ఈ ఫైనాన్స్ కంపెనీ ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్నట్టు వార్తలు రావడం స్థానికులతో పాటు మదుపరుల్లో చర్చనీయాంశంగా మారింది.

దిండిగల్ సమీపంలో పంచలోహ విగ్రహాల స్వాధీనం

అడయార్, జూన్ 6: దిండిగల్ జిల్లాలో రెండు పంచ లోహ విగ్రహాలను చెత్త కుప్పలో ఉండగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో విగ్రహం రెండు కేజీల బరువుంది. స్వాధీనం చేసుకున్న విగ్రహాలను దిండిగల్ తాలూకా కార్యాలయంలో భద్రపరిచారు. ఈ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నట్టు పళని పురావస్తు విభాగం అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడకు వచ్చి విగ్రహాలను పరిశీలిస్తున్నారు. ఈ విగ్రహాలను దొంగలు చోరీ చేసి ఈ చెత్తకుప్పలో పడేశారా అన్న కోణంలో ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

కోవైలో అన్నామలై ఓటమి

● గుండుగీయించుకున్న పార్టీ నేత

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరులో పోటీ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఓడిపోవడంతో తూత్తుకుడి జిల్లా ఉడన్‌కుడికి చెందిన జయశంకర్ అనే పార్టీ నాయకుడు గుండుగీయించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో అన్నామలై ఎన్నికల్లో గెలవకపోతే గుండుగీయించుకుంటానని శపథం చేశారు. ఆ ప్రకారమే ఆయన గురువారం ఉదయం పరమన్‌కురిచ్చి బజార్‌లోఅందరూ చూస్తుండగానే గుండుగీయించుకున్నారు.

ఇద్దరు పారిశ్రామికవేత్తల నుంచి రూ.13.5లక్షల దోపిడీ

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో బైకులో వెళ్తున్న ఇద్దరు పారిశ్రామికవేత్తలను గుర్తుతెలియని నలుగురు అటకాయించి రూ.13.5 లక్షలు దోచుకెళ్ళారు. స్థానిక పెరియమేడు ప్రాంతానికి చెందిన సులేమాన్, మహమ్మద్ అరీఫ్ తోలు ఫ్యాక్టరీ నడుపుతున్నారు. వీరిద్దరూ బుధవారం రాత్రి 11.40 గంటల సమయంలో బైకులో వెళ్తుండగా ఫోర్ట్ రైల్వేస్టేషన్ వద్ద రెండు బైకుల్లో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని కత్తులు చూపి బెదరించి వారి దగ్గరున్న రూ.13.5 లక్షల నగదు దోచుకెళ్ళారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా దోపిడీ దొంగల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మెరీనాబీచ్‌లో బుధవారం రాత్రి అయనవరంకు చెందిన ప్రేమకుమార్ కుటుంబ సభ్యులతో సముద్రతీరంలో సేదతీరుతుండగా ముగ్గురు వ్యక్తులు ఆయన భార్య ముఖంపై ఇసుకను పోసి ఆమె దగ్గరున్న బ్యాగ్ లాక్కుని పరుగెత్తారు. ప్రేమకుమార్ కేకలు విన్న పరిసరాల్లోని వారు దొంగలను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ దోపిడీ నాయకుడు జాన్సన్ పరారీలో ఉన్నాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

ఇకపై పశువులకు లైసెన్స్ తప్పనిసరి

● త్వరలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయం

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లపై పశువులు, ఎద్దులు, బర్రెల సంచారాన్ని నిరోధించే దిశగా వాటికి లైసెన్సు ఇవ్వాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. త్వరలోనే లైసెన్సు జారీ చేసే పద్ధతిని అమలు చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగరంలోని రహదారుల్లో శునకాలు, పశువులు సంచరిస్తూ వాహనాల ప్రమాదాలకు కారణమవుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పశువుల పెంపకం దార్లు తాము పెంచే ప్రతి పశువు లేదా ఎద్దు, లేదా బర్రెకు తప్పనిసరిగా లైసెన్సు పొందాల్సి ఉంటుంది. పెంపుడు శునకాలకు ఇచ్చినట్లే పశువులకు కూడా లైసెన్స్ ఇస్తామని కార్పొరేషన్ ఉన్నతాధికారులు తెలిపారు.

రూ.2,000 కోట్ల విలువైన ఈక్విటీ బాండ్ల విక్రయం

పెరంబూర్, జూన్ 6: రెండు వేల కోట్ల విలువైన ఈక్విటీ బాండ్లను వేలం ద్వారా విక్రయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 11న ముంబైలోని ఆర్బీఐ కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి 11.30 గంటల వరకు వేలం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది.

ఆధ్యాత్మికం

కోరిన వరాలిచ్చే 'కుమరన్ కుండ్రం' మురుగన్

● మధ్య స్వామిమలై క్షేత్రంలో కొలువుదీరిన బాలసుబ్రహ్మణ్యం ● కంచి పరమాచార్య సేదతీరిన పుణ్యక్షేత్రం



స్వామినాథస్వామి



కొండపై వెళ్లేందుకు మెట్ల రహదారి



మూలవిరాట్టు





ఆలయ ధ్వజస్తంభం



ఆలయ ప్రవేశ మండపం

ఆంధ్రజ్యోతి, చెన్నై

దక్షిణ చెన్నై శివారు ప్రాంతమైన హస్తినాపురం ప్రధాన రహదారిలో క్రోంపేటకు వెనుకవైపు చుట్టూ పచ్చటి చెట్లతో చిన్న కొండపై తమిళుల ఆరాధ్యదైవమైన సుబ్రహ్మణ్యస్వామివారు స్వామినాథ స్వామి పేరుతో కొలువై అద్భుత శక్తులు కలిగి భక్తకోటిని అనుగ్రహిస్తున్నారు. కుమార స్వామి కొలువైన కొండ కనుక ఈ పర్వతాలయాన్ని తమిళంలో 'కుమరన్ కుండ్రం'గా పిలుస్తున్నారు. కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర స్వామి సేదతీరిన పుణ్యక్షేత్రంగా ఆలయానికి పేరుంది. కంచిపరమాచార్యుల ఆదేశాల మేరకే ఇక్కడ ఈ శైవాలయ నిర్మాణం జరిగింది. అంతే కాకుండా కంచి పరమాచార్యుల పూర్వాశ్రమనామధేయమైన స్వామినాథస్వామి పేరుతోనే ఈ ఆలయంలోని స్వామిని పిలుస్తున్నారు. నగరంలో ప్రముఖ పర్వతాలయాలుగా పేరుగడించిన వైష్ణవక్షేత్రం తీరునీర్‌మలైకి, శైవక్షేత్రమైన త్రిశూలం క్షేత్రానికి మధ్యలో ఈ కుమార స్వామి పర్వతాలయం ఉంది. అంతేగాక కుమారస్వామి కొలువైన తంజావూరు జిల్లాలోని (దక్షిణ) స్వామిమలైకి, ఢిల్లీలోని (ఉత్తర) స్వామిమలైకి మధ్య ఈ కుమరన్ కుండ్రం ఉండటంతో ఈ క్షేత్రానికి 'మధ్య స్వామి మలై' అనే పేరు కూడా ఉంది. ఈ ఆలయంలో స్వామినాథస్వామి సకల సంపదలనిచ్చే కుబేరుడు ఉత్తరదిశలో దండాయుధం ధరించి కొలువుదీరి ఉండటంతో ఈ స్వామిని దర్శిస్తే సకల సంపదలు కలుగుతాయి. కనుకనే ఈ స్వామివారిని 'ఐశ్వర్య మురుగన్' అని కూడా పిలుస్తున్నారు. ఈ కొండను కృత్తిక చిత్రాపౌర్ణమి దినాల్లో స్వామినాథస్వామివారే ప్రదక్షిణ చేయటం మరీ విశేషం. వివాహయోగం, సంతానంతో పాటు సకల సంపదలనిచ్చే ఈ స్వామినాథస్వామిని దర్శించేందుకు మంగళవారాలు, కృత్తిక దినాలు, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ క్షేత్రాన్ని దర్శిస్తే అటు స్వామిమలైని, ఇటు మదురై మీనాక్షి ఆలయాన్ని దర్శించినంత ఫలమని శైవాగమ పండితులు చెబుతున్నారు.



ముఖ మండపం

ఆలయ వైభవం...

కొండమీది ఆలయానికి వెళ్లేందుకు 120 మెట్లతో కాలినడక మార్గం ఉంది. ముందుగా 55 అడుగుల ఎత్తు, ఐదంతస్తులతో రాజగోపురం దర్శనమిస్తుంది. దానిపై సుబ్రహ్మణ్యస్వామివారి లీలా విశేషాలను తెలిపే శిల్పాలు, మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణోత్సవ దృశ్యాలు, శేషపాన్పుపై పవళించిన లక్ష్మీ సమేత మహావిష్ణువు శిల్పాలు, శ్రీకృష్ణుడి కాళీయమర్ధన దృశ్యాలతో శిల్పాల సహా మొత్తం 145 శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. కొండ దిగువన అరుణగిరినాదర్ మండపం సమీపంలో ఇరువైపులా వినాయకుడి సన్నిధి, జయమంగళ కాళి సన్నిధి, ఇడుంబన్ సన్నిధులున్నాయి. అరుణగిరినాధర్ మండపం సమీపంలోనే వేదపాఠశాల కూడా ఉంది. రాజగోపురం వినాయకుడి సన్నిధికి చేరువగా కొత్త మండపం దాటి వెళితే సిద్ధి వినాయకుడి సన్నిధి, షణ్ముగర్ సన్నిధిని చూడగలం. ఇక్కడే శరభేశ్వరుడు దక్షిణదిశగా ఆశీనుడై ఉన్నారు. వీటికి చేరువగా నవగ్రహాల సన్నిధి కూడా ఉంది. ఇక సగం మెట్లదారిని దాటుకుని వెళ్తే మీనాక్షి, సోమసుందరాలయం దర్శనమిస్తుంది. ఈ ఆలయంలోని నటరాజస్వామివారు కుడిపాదాన్ని పైకెత్తి నృత్య భంగిమలో ఉన్నారు. ఇది మదురైలోని వెళ్లియంబళ (వెండి పైకప్పు కలిగిన ఆలయంలో) నటరాజస్వామివారిని తలపించేలా ఉండటం విశేషం. గర్భాలయంలో స్వామినాథస్వామి దండం పట్టుకుని బాలసుబ్రహ్మణ్యస్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్వామివారి పీఠంలో, సన్నిధి ఎదురుగా ఏనుగు విగ్రహాలున్నాయి. ఉత్సవమూర్తి సుబ్రహ్మణ్యస్వామివారు వళ్లీ దేవసేన సమేతుడై దర్శనమిస్తారు. స్వామివారి సన్నిధి ఎదుట 36 అడుగుల ఎత్తు ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. కొండపై ఆలయానికి చేరువగా కుమారతీర్థం పేరుతో తీర్థకొలను కూడా ఉంది.



వళ్లీదేవసేన సమేత స్వామినాథస్వామి

ఆలయ చరిత్ర...

నాలుగు దశాబ్దాల క్రితం కుమరన్ కుండ్రం ప్రాంతం గతంలో జనసంచారం లేని చిట్టడవిని తలపించేలా ఉండేది. ఆ చిన్న కొండను పారిశుధ్య కార్మికులు కొందరు శుభ్రం చేస్తుండగా కుమారస్వామి ధరించే శూలాయుధం లభించింది. దీంతో కుమారస్వామి భక్తులందరూ ఆ శూలాయుధాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభిం చారు. 1956లో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర స్వామి క్రోంపేట వచ్చినప్పుడు ఈ కొండపై సేదతీరారు. ఇక్కడ కుమారస్వామి శూలాయుధానికి జరిగే పూజలు గురించి స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఇక్కడ కుమారస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ఈ చిన్న కొండకూడా అనువుగా ఉందని, ఇక్కడ మురుగన్ ఆలయాన్ని నిర్మించమని భక్తులకు చంద్రశేఖరేంద్ర స్వామి ఆదేశించారు. ఆ కంచి పరమాచార్యుల ఆదేశానుసారం స్థానిక భక్తులంతా కలిసి ఈ పర్వత శిఖరాగ్రంలో ఆలయాన్ని నిర్మించారు. 1979లో ఆలయానికి మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు.




స్వామినాథస్వామివారి సన్నిధి

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో ఆడి కృత్తిక, తై కృత్తిక, చిత్రాపౌర్ణమి దినాల్లో స్వామినాథస్వామి వారే గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. కృత్తిక, షష్ఠి దినాలు, స్కంధషష్ఠి, తైపూసం, పంగుణి ఉత్తిరం ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. వైకాశి విశాఖ ఉత్సవం కూడా అత్యంత వైభవంగా జరుగుతుంది..

తమిళ ఉగాది సందర్భంగా కొండమీది ఆలయానికి వెళ్లే దారిలో మెట్లకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆ రోజు స్వామివారు ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిస్తారు. స్కంధషష్ఠి వేడుకల్లో భాగంగా ఈ ఆలయంలో శూరసంహారం కూడా వైభవంగా జరుగుతుంది. శూర సంహారం ముగిసిన తర్వాత స్వామివారు గజవాహనంలో ఊరేగింపుగా వెళతారు.



గర్భాలయం ఎదుట గజవిగ్రహం

స్వామివారి నామధేయం : బాలసుబ్రహ్మణ్యం, స్వామినాథ స్వామి
అమ్మవార్ల నామధేయం : వళ్లి, దేవసేన
స్థల వృక్షం : రావి చెట్టు
తీర్థం : కుమారతీర్థం

ఎలావెళ్ళాలి?

ఈ ఆలయం గిండి నుంచి 12కి.మీ.లు, తాంబరం నుండి 7 కి.మీ.ల దూరంలో ఉంది.

నగరంలో ఎగ్మూరు రైల్వేస్టేషన్ నుంచి లోకల్ రైళ్లలో క్రోంపేట చేరుకుని అక్కడి నుంచి ఆటోలు, టాక్సీల్లో హస్తినాపురం మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న కుమరన్ కుండ్రం క్షేత్రానికి చేరుకోవచ్చు. నగరం నలుమూలల నుంచి తాంబరం వెళ్లే సిటీ బస్సుల్లోను క్రోంపేట చేరుకుని అక్కడి నుంచి ఆటోలు, టాక్సీల్లో వెళ్లొచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 6.30 నుండి 11 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4.30 నుండి రాత్రి 8.30 గంటలవరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

చిత్రజ్యోతి

సిద్ధార్థ్ హీరోగా 'మిస్ యూ'



సిద్ధార్థ్ హీరోగా 'మిస్ యూ' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని ప్రింటింగ్, డిజిటల్ మార్కెటింగ్ టెక్నాలజీ విభాగంలో అగ్రగామిగా ఉన్న 7 మైల్స్ పర్ సెకండ్ అనే సంస్థ ద్వారా సామువేల్ మేథ్యూ ఈ ప్రేమ కథా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గత యేడాది 'చిత్తా' అనే సినిమాతో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న సిద్ధార్థ్... ఇపుడు మిస్ యూ పేరుతో తెరకెక్కే ప్రేమకథా చిత్రంలో నటించేందుకు సమ్మతించారు. తెలుగు, కన్నడ భాషల్లో మంచి గుర్తింపు పొందిన ఆషికా రంగనాథ్‌ను ఇందులో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. 'మాప్ల సింగం', 'గళత్తిల్ సందిప్పోం' తదితర చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎన్.రాజశేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ప్రేమ, యాక్షన్, కామెడీ ఇలా ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నారు. సినిమాలో కేవలం హీరోహీరోయిన్లకే ప్రాధాన్యత ఇవ్వకుండా హాస్యంతో పాటు ఇతర పాత్రలకు కూడా ప్రాముఖ్యత ఇచ్చేలా తెరకెక్కించనున్నారు. ఇతర పాత్రల్లో జేపీ, పొన్‌వణ్ణన్, కరుణాకరన్, నరేన్, అనుపమ, రమా, బాలశరవణన్, లొల్లుసభ మారన్ తదితరులు నటిస్తున్నారు. మొత్తం ఎనిమిది పాటలుండే ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం సమకూర్చుతున్నారు. 'చదురంగ వేట్టై' వంటి పలు హిట్ చిత్రాలకు సినిమాటోగ్రఫీని అందించిన కేజీ వెంకటేష్ ఈ సినిమాకు ఛాయాగ్రహణం సమకూర్చుతున్నారు. ఈ మూవీలో హీరో సిద్ధార్థ్‌ను చాలాకాలం తర్వాత లవర్ బాయ్‌గా ప్రేక్షకులు చూడనున్నారు.

మూడు కథలు.. ఒక ముగింపుతో హైపర్ లింక్ మూవీ

మూడు కథలు... ఒక ముగింపుతో హైపర్ లింక్ చిత్రం తెరకెక్కనుంది. విధార్థ్, జనని హీరోహీరోయిన్లుగా నటించనున్నారు. తమిళ చిత్రపరిశ్రమలో అనేక హిట్ చిత్రాలకు పోస్ట్ ప్రొడక్షన్ చేసే కువియం స్టూడియోస్ అనే సంస్థ కువియం ఫిలిమ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించనుంది. నిర్మాత లాల్‌కుడి ఎం.హరిహరన్. ఈ కొత్త చిత్రం పూజా కార్యక్రమం నగరంలో జరిగింది. విధార్థ్, జనని, ఎంఎస్ భాస్కర్, శరవణన్, పృథ్విరాజ్, నమిత కృష్ణమూర్తి, షారిక్ హాసన్, వికాస్, మహా తదితరులు నటిస్తున్నారు. కార్తీక్ నేతా పాటలకు లాల్‌కుడి ఎం.హరిహరన్ సంగీతం సమకూర్చుతున్నారు. కెమెరా ప్రభు రాఘవ్. కథ, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం కృష్ణ కుమార్. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'మనం చేసిన తప్పులు మనల్ని ఎప్పటికీ వదలవు. ఆ తప్పులు ఏదో రూపంలో మనల్ని వచ్చి చేరుతాయన్న కథాంశంతో ఈ హైపర్‌లింగ్ స్క్రిప్టు సిద్ధం చేశాను. ఇప్పటివరకు ఎవరూ చెప్పని రీతిలో డిఫరెంట్‌గా చెప్పబోతున్నాం. సస్పెన్స్ థ్రిల్లర్, డ్రామా, లవ్ ఇలా మూడు కోణాల్లో ఈ స్క్రీన్‌ప్లే సాగుతుంది. జూలైలో షూటింగ్ ప్రారంభించి 35 రోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.



విధార్థ్ - జనని

'రయిల్'గా మారిన 'వడక్కన్'



'రయిల్'లో ఓ దృశ్యం

ఉత్తరాది నుంచి తమిళనాడుకు వచ్చే వలస కార్మికుల కథాంశంతో తెరకెక్కించిన చిత్రం 'వడక్కన్'. ఈ చిత్రం విడుదలకు సెన్సార్ బోర్డు అనుమతి నిరాకరించింది. చిత్ర టైటిల్ ఉత్తరాదివారిని కించపరిచేలా ఉందని పేర్కొంటూ, టైటిల్ మార్చాలని సూచించింది. దీంతో చిత్ర బృందం వెనక్కి తగ్గింది. 'వడక్కన్' సినిమా టైటిల్‌ను 'రయిల్' (రైల్)గా మార్చినట్టు అధికారికంగా ప్రకటించారు. పలు విజయవంతమైన చిత్రాలకు కథ, మాటలు అందించిన భాస్కర్ శక్తి ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కుంకుంరాజ్, వైరమాల జంటగా నటించగా, రమేష్ వైద్య, పర్వేజ్ మెహ్రూ, సమీరా తదితరులు ఇతర పాత్రలను పోషించారు. డిస్కవరీ సినిమాస్ పతాకంపై ఎం.వేదియప్పన్ నిర్మించారు. ఈ చిత్రానికి ఎస్‌జే.జనని సంగీతం అందించగా, తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ సమకూర్చారు. ఈ నేపథ్యంలో సెన్సార్ బోర్డు సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపడంతో ఈ చిత్ర టైటిల్ మారుస్తున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది.

ఒక్కోసారి ఒక్కో కొత్త అనుభవం

● రజినీకాంత్



హిమాలయ పర్వత ప్రాంతాల్లో తాను చేపట్టిన ఆధ్యాత్మిక పర్యటన ఒక్కోసారి ఒక్కో రకమైన కొత్త అనుభూతి ఇస్తుందని సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిప్రాయడ్డారు. ఆయన హిమాలయ పర్యటనను ముగించుకుని నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, 'సాధారణంగా ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక పర్యటన చేస్తుంటాను. అలాగే, ఈ దఫా కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేశాను. ఈ పర్యటనలో రిషికేష్, బద్రీనాథ్, బాబాజీ గుహ ఇలా అనేక ఆధ్యాత్మిక స్థలాలను సందర్శించాను. ఈ పర్యటన ప్రతి యేటా ఒక్కోరకమైన కొత్త అనుభూనిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారా అని ప్రశ్నించగా, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసే నరేంద్ర మోదీలకు శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

ఎన్‌ఎల్‌సీఐఎల్ చైర్మన్‌కు నవరత్న అవార్డు



ప్రసన్నకుమార్ మోటుపల్లి

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎల్‌సీఐఎల్ చైర్మన్ ప్రసన్నకుమార్‌కు నవరత్న పీఎస్‌యూ అవార్డు వరించింది. భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక మ్యాగజైన్ దలాల్ స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్ జర్నల్ 'నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్' (ఎన్‌ఎల్‌సీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లికి 2023 సంవత్సరానికిగాను నవరత్న పీఎస్‌యు అవార్డు ప్రదానం చేసింది. గనుల తవ్వకాలు, విద్యుదుత్పాదక రంగాల్లో ఎన్‌ఎల్‌సీ ఇండియా సమర్థవంతమైన పనితీరు, సామర్థ్యం వృద్ధి, పెట్టుబడిదారుల్లో విశ్వాసం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ అవార్డును ఎన్‌ఎల్‌సీఐఎల్ అభివృద్ధికోసం అంకితభావంతో శ్రమిస్తున్న సంస్థ సిబ్బందికి అంకితమిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ ప్రకటించారు.

రామేశ్వరంలో వెనక్కి మళ్లిన సముద్రం

పెరంబూర్, జూన్ 6: వేసవి సెలవులు, వైకాశి అమావాస్య సందర్భంగా గురువారం రామేశ్వరానికి వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి దర్శనం కోసం తరలివచ్చారు. ఉదయం భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న సమయంలో సముద్రం హఠాత్తుగా 150 మీటర్ల వెనక్కి వెళ్లింది. దీంతో, అడుగున ఉన్న పాచితో కూడిన బండరాళ్లు, స్టార్ ఫిష్ తదితరాలు బయటపడ్డాయి. దీంతో, భక్తులు దిగ్భ్రాంతి చెందారు. అలాగే, ఓలైగుడ, సంగుమాల్, పాంబన్ తెర్కువాడి, చిన్నపాలం తదితర ప్రాంతాల్లోనూ సముద్రం వెనక్కి వెళ్లడంతో నాటుపడవలో వెళ్లి చేపలు పడుతున్న జాలర్లు ఇబ్బంది పడ్డారు. కొద్దిసేపటి తర్వాత సముద్రం యథా స్థితికి చేరుకోవడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.



సముద్రతీరంలో బయల్పడిన పాచితో కూడిన బండరాళ్లు

ముగిసిన క్రీడా శిక్షణా శిబిరం



క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, జూన్ 6: స్థానిక ఐసిఎఫ్ మైదానంలో స్పోర్ట్స్ కనెక్ట్ గ్లోబల్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన హాకీ, బాస్కెట్‌బాల్‌పై శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ శిక్షణకు సుమారు 121 మంది విద్యార్థులు హాజరుకాగా, మాజీ కోచ్‌లు మహమ్మద్ రియాజ్, క్రిస్టీ ఎలేనా, ప్రసన్న కుమారి శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి స్పోర్ట్స్ కనెక్ట్ గ్లోబల్ సంస్థ చైర్మన్, మాజీ అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులు ఎస్.పురుషోత్తమన్ హాజరై, శిక్షణ పూర్తిచేసిన క్రీడాకారులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.

వీఐటీ వర్సిటీ ఛాన్స్‌లర్‌కు ప్రశంసలు

వేలూరు, జూన్ 6: అమెరికా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన వీఐటీ యూని వర్శిటీ ఛాన్స్‌లర్ విశ్వనాధన్ అభినందన సభ స్థానిక అప్పర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఇటీవల న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ వర్శిటీ వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్ అందజేసిన విషయం తెలిసిందే. అభినందన సభలో శైవ వేలాలర్ సంఘం జిల్లా కోశాధికారి తనిగైనాథన్, అప్పర్ ట్రస్ట్ సెక్రటరీ రమేష్‌కుమార్, సెక్రటరీ ఆర్ముగం, అరంగ వాచ్‌మెన్‌లు రఘురామన్, లోకనాథన్, కృష్ణమూర్తి, తనిగైవేల్ శేఖర్, సభ్యులు బ్రహ్మాపురం ప్రకాశం, సేనపాక్కం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొని, చాన్సలర్ విశ్వనాధన్‌ను సత్కరించారు.




వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్‌ను సత్కరిస్తున్న సంఘ నిర్వాహకులు



కోయంబత్తూరులో జరుగుతున్న అఖిల భారత బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం సెమీ ఇండోర్ స్టేడియంలో తలపడుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా లయోలా పురుషుల జట్లు

వివేకానందరాక్‌కు పడవ సవారీ నిలిపివేత



పెరంబూర్, జూన్ 6: కన్నియాకుమారి సముద్రం మధ్యలో ఉన్న వివేకానంద రాక్‌కు పడవ రవాణాను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. సముద్ర వాతావరణంలో ఏర్పాడిన మార్పులు కారణంగా గురువారం ఉదయం నుంచి అలల తాకిడి ఉధృతంగా ఉంది. సాధారణం కంటే సుమారు 3 నుంచి 4 అడుగుల ఎత్తుకు అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా వివేకానంద రాక్‌కు పడవలను తాత్కాలికంగా అధికారులు నిలిపివేశారు. దీంతో, వివేకానంద రాక్‌కు వెళ్లాలని వచ్చిన పర్యాటకులు పడవల రద్దుతో నిరాశగా వెనుదిరిగారు.